క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



స్కూల్లో విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న టీచర్లు

పాకాల: వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మొగరాల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుమలత అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో నేషనల్ గ్రీన్స్ కార్ప్స్–ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం, వెంకటసిద్ధులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, సుల్తాన్, రామమూర్తి, ప్రమోదిని, శైలజ, వ్యాయామోపాధ్యాయురాలు విమలా విక్టోరియా, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అదనపు ఈవోకు అందజేస్తున్న దాతలు

తిరుమల: గుంటూరు జిల్లాకు చెందిన భక్తుడు అలపాటి సురేష్ టీటీడీ నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు బుధవారం రూ.10,11,111/- విరాళంగా అందించారు. ఈ విరాళానికి సంబంధించిన డీడీని బుధవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి స్వయంగా అందజేశారు.

7న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ

తిరుపతి కల్చరల్: ఈనెల 7న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 280 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్‌కే.హుస్సేన్, రవిచంద్ర, చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని బుధవారం యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణిందర్ జిత్ సింగ్ బిట్టు, హర్యానా మాజీ సీఎం ఉపేందర్ సింగ్ హుడ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో గర్భిణులు, వారి సహాయకులకు బుధవారం ఉచితంగా అల్పాహారం వితరణ చేశారు. అనంతరం 95 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దాత పూజ, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ భాస్కర్, అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు రామారావు, రాజేంద్రప్రసాద్ ,లియో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జిల్లా పీఓగా చాందిని



తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్టీసీ డిపో మెకానిక్ విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ చాందినిని ఆర్టీసీ జిల్లా పర్సనల్ ఆఫీసర్(పీఓ)గా నియతులయ్యారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీఓగా ఉన్న షహజాద్‌ను చిత్తూరు ఆర్టీసీ పీఓగా బదిలీ చేశారు.

భూసార ఆధారిత ఎరువులు వాడండి



తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణారావు


చంద్రగిరి: రైతులు భూసార ఆధారిత ఎరువులు మాత్రమే వాడాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, చిత్తూరు జిల్లా డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారావు రైతులను కోరారు. మండలంలోని పనపాకం, దోర్నకంబాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది'గ్యాప్ పొలంబడి' నిర్వహించారు. వరి, వేరుశనగను ఆశించే వివిధ తెగుళ్లు, వాటి నివారణ చర్యలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను, సేంద్రియ ఎరువులు..ఇత్యాది వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సి.విజయ్ భాస్కర్, దోర్నకంబాల రైతు సేవా కేంద్రం వీఏఏ షారోన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

పులివర్తీ..! తీర్చవా గంగతో దాహార్తి

తాగునీటి సమస్యలతో సతమతమవుతున్న ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీకి తెలుగుగంగ నీళ్లిచ్చి దాహార్తి సమస్య తీరుస్తానని ఎన్నికల సమయంలో పులివర్తి నాని ఓట్ల కోసం ప్రధాన అస్త్రంగా వాడుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా హామీ నెరవేర్చిన పాపానపోవడం లేదు. వాస్తవానికి తిరుపతి నగరం మొత్తానికి తెలుగు గంగ నీరు మంగళం నుంచే సరఫరా అవుతున్నా ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీల ప్రజల గొంతుకలను మాత్రం తడపకపోవడం అసలైన విషాదం.

- ఓట్ల అస్త్రంగా లబ్ధి
- చంద్రబాబు నుంచి పులివర్తి వరకు అందరూ హామీలతోనే సరి!

తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ మండలం, చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఉమ్మడి శెట్టిపల్లె పేరుకే పంచాయతీ అయినా 34 వేల మంది జనాభాతో ఒక మండలాన్ని తలపించే స్థాయిలో ఉంటోంది. ప్రస్తుతం ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీని మంగళం, తిరుమలనగర్, రణధీరపురం, సప్తగిరికాలనీ, కొత్తమంగళం పంచాయతీలుగా విభజించారు. ఇవన్నీ 34 గ్రామాలు, కాలనీలతో విస్తరించి ఉన్నాయి. దశాబ్దాల కాలంగా వేసవిలోనే కాకుండా సాధారణ రోజుల్లో సైతం ఇక్కడ తాగునీటి సమస్య వేధిస్తోంది. మూడు నుంచి వారం రోజుల వరకు నీటి సరఫరా జరగని కాలనీలు ఇప్పటికీ ఉన్నాయి. జనాభా, మూగజీవాల అవసరాల దృష్ట్యా రోజుకు 22 లక్షల లీటర్ల నీరు పంచాయతీకి అవసరమరమని అంచనా. ప్రజలకు కనీస తాగునీటి వసతిని కల్పించలేక పంచాయతీ పాలకవర్గాలు, అధికారగణం చేతులెత్తేయడంతో పదేళ్ల క్రితం తెలుగుగంగ నీటి కోసం ఖాళీ బిందెలతో



జనం ధర్నా, రాస్తారోకోలతో ఆందోళన బాట పట్టారు. ఆ తర్వాత దీనిని రాజకీయ నాయకులు ఎన్నికల అస్త్రంగా సైతం వాడుకోవడం మొదలైంది. ప్రధానంగా గత ఎన్నికల్లో ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని తనను గెలిపిస్తే ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీకి ఆరు నెలల్లో తెలుగు గంగనీటి సౌకర్యం కల్పిస్తానని, దాహార్తిని తీరుస్తానని ఊదరగొట్టారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలమైనా ఒక్క బిందెడు నీటిని కూడా ఆయన ఇవ్వలేదని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. వాస్తవానికి 2018లో టీడీపీ హయాంలో పంచాయతీ నీటి సమస్యను స్థానిక నాయకులు అప్పటి సీఎం చంద్రబాబుకు నివేదించారు. దీంతో అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్‌కు ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం పురమాయించింది. అయినప్పటికీ ఏళ్లు గడచిపోయాయి. చంద్రబాబు నుంచి ఇప్పటి నాని వరకూ ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీని నీటిమీద రాతలు చేశారనేది కాలం చెప్పిన చేదు నిజం

'తెలుగు గంగ'ను ఇచ్చేందుకు చెవిరెడ్డి ఎంతో కృషి

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీల ప్రజలకు గంగ నీటిని ఇచ్చేందుకు అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. ఈ విషయమై అప్పటి కార్పొరేషన్ కమిషనర్ గిరీషాతో పలు పర్యాయాలు చర్చించారు. అంతేకాకుండా నాటి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన కూడా దీనిపై స్పందించారు. గంగ నీటిని శెట్టిపల్లె ప్రజానీకానికి ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్న సమయంలో ఎన్నికలు రావడం, ఎన్నికల కోడ్ మూలాన ప్రతిష్టంభన కలిగింది.

కళ్ల ముందే నీళ్లున్నా కన్నీళ్లే..!



మా పంచాయతీలో మా కళ్ల ముందే తెలుగు గంగ నీరు తిరుపతి నగరానికి వెళుతున్నా మేము వాడుకోలేని పరిస్థితి. అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అని ఎంతో కాలంగా నాయకులు చెబుతున్నా గ్లాసెడు నీళ్లు కూడా ఇచ్చిన పాపానపోలేదు. గంగ నీటిని ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్నికల అస్త్రంగా వాడుకుని ఓట్లు లబ్ధి పొందారు. హామీని మాత్రం నెరవేర్చలేదు. మాకు కన్నీళ్లే మిగిల్చారు.

ఎన్.భారతి, తిరుమలనగర్ పంచాయతీ

ఎన్నికల హామీ గాలికేనా?



పులివర్తి నాని ఓట్ల కోసం తెలుగు గంగనీటిని ప్రధాన అస్త్రంగా వాడారు. ఆయన ఎమ్మెల్యే అయి ఏడాదిన్నర అయినా గంగ ఊసే లేదు. ఉమ్మడి శెట్టిపల్లె ప్రజలకు తెలుగు గంగనీటిని ఇస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని నిండా మోసం చేశారు.

-యశోదమ్మ, మంగళం పంచాయతీ

అన్నీ అనుకూలించి ఉంటే నీళ్లు అప్పుడే అందేవి



కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మా పంచాయతీ వాళ్లను కూడా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలుగు గంగ నీటిని ఇచ్చేందుకు ఆయనతో పాటు తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కూడా కృషి చేశారు. అన్నీ అనుకూలించి ఉంటే మాకెప్పుడో నీళ్లు అందేవి.

రుక్మిణమ్మ, సప్తగిరినగర్ గ్రామ పంచాయతీ

కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

–మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం 30వ వార్డులోని రిజర్వాయర్ కాలనీ, ఆయుర్వేదిక్ హాస్పిటల్, స్విమ్స్ కూడలి ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిత్యం చెత్త సేకరణకు వాహనాలు వస్తున్నాయా, లేదా? అని స్థానికులను ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ, చాలా మంది తమ ఇళ్లలోని చెత్తను బయట పడేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ ఇళ్ల వద్దకు వచ్చే తమ వాహనాలు, సిబ్బందికి చెత్తనివ్వాలని కోరారు. అలాగే కాలువల్లో చెత్త, ఆయుర్వేద హాస్పిటల్ వ్యర్థాలు



నగరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వేయరాదని, ఎవరైనా కాలువల్లో వేస్తే జరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో మరింత బలోపేతం

– తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కొత్తగా పార్టీలో చేరిన వారిని సమన్వయం చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేద్దామని పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తల్లో ఏవైనా అసంతృప్తులు, వ్యక్తిగత అభిప్రాయభేదాలు ఉన్నా అవి సానుకూల చర్చలతో పరిష్కరించుకునేలా చూసుకుని సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. అలాగే, కొత్తగా పార్టీలో చేరే వారిని ప్రోత్సహించడంతో పాటు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు సాకం ప్రభాకర్, సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి, నవీన్ బ్యాంగి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

రాజకీయ రౌడీలు..సెటిల్‌మెంట్ గ్యాంగులు

–రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఆందోళన

తిరుపతి కల్చరల్: పోలీసుల అండతో రాజకీయ రౌడీలు, సెటిల్‌మెంట్ గ్యాంగులు తయారవడంతో ఆధ్యాత్మిక తిరుపతి నగర పవిత్రత మంటగలుస్తోందని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం వామపక్షాలు రౌండ్ టేబుల్ సమావేశం పి.వెంకటరత్నం , వేణుగోపాల్, హరీష్‌ల అధ్యక్షతన నిర్వహించాయి. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, విశ్రాంత జడ్జిఏ.గుర్రప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడారు. తిరుపతితోపాటు పరిసరాల్లో భూకబ్జాల దందా, గంజాయి కేసులు పెరిగిపోతూండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మఠం, టీటీడీ భూములు కబ్జా చేస్తున్నా, ఫేక్ డాక్యుమెంట్లతో విక్రయిస్తున్నా అధికారులు చూస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. పైగా అక్రమార్కులకు సాక్షాత్తు అధికార ప్రజాప్రతినిధుల అండదండలు ఉంటున్నాయని ఆరోపించారు. జిల్లాలో వివిధ కబ్జాల ఉదంతాలను ఉదహరించారు. పైగా న్యాయం చేయాల్సిన పోలీసులే కొన్ని ఘటనల్లో కబ్జాదారులకు వత్తాసు పలకడం శోచనీయమని విమర్శించారు. రెవెన్యూ అధికారులు కూడా పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని ధ్వజమెత్తారు. తిరుపతి పవిత్రతను కాపాడాలని కోరుతూ ఈ నెల 13న ర్యాలీ చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ నేత అంజయ్య, రిటైర్డ్ జేడీ విజయకుమార్ మాట్లాడారు. పౌర చైతన్య వేదిక జిల్లా నేత వాకా ప్రసాద్, సీపీఐ నేత విశ్వనాథ్, కాంగ్రెస్ నేత లోకేష్, లాయర్ అసోసియేషన్ నేత చల్లా వెంకటయ్య, ఏఐఎంఎస్ నేత లక్ష్మి, డీఎంసీ భాస్కర్, దళిత సంఘ నేత ధనశేఖర్, సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ నేతలు, సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులు, మహిళలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత రామానాయుడు

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం యాగశాలలో అకల్మష ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన అనంతరం కల్యాణ మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం, సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్లు, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ ఏబీ.నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీలో నెల రోజులుగా ఇస్తున్న కంప్యూటర్ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమిజబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్ శోభారాణి మాట్లాడారు. శిక్షణతో విద్యార్థినులు కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థినులు

భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు

- టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీ వారి దర్శనార్థం వచ్చే భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వారం రోజుల క్రితం భక్తురాలు ఊర్వశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గూగుల్ ద్వారా వసతి కోసం వెతికే క్రమంలో శ్రీనివాసం రెస్ట్ హౌసెస్ అనే వెబ్‌సైట్‌లో ఇచ్చిన మొబైల్ నెంబర్ 8062180322 ను సంప్రదించగా, అభిమన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్‌లో రిసెప్షన్ కి చెందిన వాడినని తప్పుడు సమాచారంతో పరిచయం చేసుకున్నాడు. ఆ భక్తురాలికి వసతి కల్పిస్తామని నమ్మబలికి కొంత మొత్తాన్ని వసూలు చేశాడు. డబ్బు చెల్లిస్తే వసతి టికెట్‌ను పీడీఎఫ్ పంపిస్తామని హామీ ఇచ్చాడు. డబ్బు తీసుకున్న తర్వాత అభిమన్యు తన ఫోన్ కాల్స్ , వాట్సాప్ మేసేజ్‌లకు స్పందించకుండా మోసం చేశాడు. దీంతో నకిలీ వెబ్ సైట్ ద్వారా మోసపోయానని గ్రహించిన భక్తురాలు ఊర్వశి 1930 క్రైమ్ హెల్ప్ లైన్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల టీటీడీ సేవల పేరుతో నకిలీ వెబ్ సైట్లు ద్వారా భక్తులను మోసం చేస్తున్న ఘటనలు అధికమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఈవో సూచించారు. భక్తులను అనుమానాస్పద వ్యక్తులు, దళారులు ప్రలోభ పెడితే ముందుగా టీటీడీ విజిలెన్స్ విభాగం నంబర్‌కు 0877–2263828 ఫోన్ చేసి అనుమానాలను భక్తులు నివృత్తి చేసుకోవాలన్నారు. నకిలీ దర్శన టికెట్లు, వసతి పేరుతో దందా చేస్తే వెంటనే మోసపూరిత వ్యక్తులు, దళారుల వివరాలను ఫోన్ చేసి విజిలెన్స్ అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. శ్రీవారి దర్శనం, వసతి కోసం టీటీడీ అధికారిక వెబ్ సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్ లో తమ ఆధార్ కార్డ్ ఆధారంగా టికెట్లు బుక్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు టీటీడీ టోల్ ఫ్రీ నంబర్ 155257కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!

తిరుపతి సిటీ: తమ సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్నికల్ అసోసియేషన్ నాయకులు బుధవారం తిరుపతిలో సాంకేతిక విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ ప్రియకు వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ బాషా, ఉపాధ్యక్షులు శ్రీహరి మాట్లాడారు. జనరల్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్, రేడియో, టీవీ మెకానిక్ విభాగాలకు సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కొన్నేళ్లుగా ఎంతో మంది ఉద్యోగులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌జేడీ ప్రతిస్పందిస్తూ.. పై స్థాయి అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి నరేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు దామోదర్, మహబూబ్ బాషా, పాపయ్య, అనిల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్‌జేడీకి వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి బస్టాండ్‌లోని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కళాశాలలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఐదుగురు మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి లైసెన్స్ జారీ చేయడానికి దరఖాస్తులు గడువు ఈ నెల 8 వరకు పొడిగించినట్లు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు కలెక్టరేట్‌లో బీ–బ్లాక్‌లోని 307 రూమ్‌లో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. అదనపు సమాచారం కోసం 9959015657, 7013008498 నంబర్లను సంప్రదించాలన్నారు.

'బ్లాక్ ఫారెస్ట్' హిట్ అవ్వాలి



చిత్రం నటీనటులపై క్లాప్ కొడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: వీఎస్ఆర్ క్రియేషన్స్ పతాకంపై త్వరలో ప్రారంభం కానున్న సస్పెన్స్, కమర్షియల్ థ్రిల్లర్ 'బ్లాక్ ఫారెస్ట్' మూవీ బ్లాక్ బస్టర్ అవ్వాలని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ఆకాంక్షించారు. ఈ బ్లాక్ ఫారెస్ట్ చిత్రం స్క్రిప్ట్ పూజా కార్యక్రమంలో పుత్తూరు బైపాస్ రోడ్డు అంజారమ్మ కనంలోనున్న అంజారమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ క్లాప్ కొట్టి చిత్రం బృందం, నటీనటులకు అభినందించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అనురాగ్ శివ, నిర్మాత వీఎస్.రెడ్డి లీడ్ రోల్ ఆర్టిస్టులు శ్రావణి, తన్సియా, శ్రీలీల, సందీప్, డాక్టర్ రమేష్, తులసీ యాదవ్, గంగాధర్‌బాబు, హేమారెడ్డి, వెంకటేశ్వర్లు, యువరాజ్ యాదవ్, సురేంద్ర, దిలీప్, చైతన్య, రాజు, పీవీ.రెడ్డి, విజయ పాల్గొన్నారు.

గదుల వేలం..ఆలయానికి ఆదాయం



ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి: స్థానిక శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలోని చిల్లర దుకాణాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది కాల పరిమితితో పూజాసామగ్రి విక్రయ హక్కు నిమిత్తం వేసిన వేలంలో పోటాపోటీగా వేలం పాడారు. దీంతో రికార్డుస్థాయిలో రూ.2.95లక్షలు ఆదాయం లభించింది. అలాగే అమ్మవారికి భక్తులు సమర్పించే వస్త్రాలు సేకరణకు నిర్వహించిన వేలంలో రూ.1.11లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.1.20లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ యువరాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో 19మంది ఉత్తములు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో 19మంది ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక చేస్తూ వర్సిటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ట్స్ విభాగంలో ఐదుగురు, సైన్స్ విభాగంలో ఆరుగురు, ఇంజినీరింగ్ కళాశాలలో ఐదుగురు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ముగ్గురిని ఎంపిక చేశారు.